సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం। 31। అక్టోబర్। 2023



నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పి.సుజాత (సికింద్రాబాద్) రూ.1,01,116 విరాళం సోమవారం ఆలయ అర్చకులకు అందజేశారు.




భక్తుల వసతికి శివసదన్ సిద్ధం

రత్నగిరిపై ఐదంతస్తుల 'శివసదన్' సత్రంలో 137 గదులను మంగళవారం నుంచి భక్తులకు అద్దె కివ్వనున్నట్టు దేవస్థానం ఈఓ తెలిపారు.

II లో

కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3500, మధ్యడెల్టాకు 2600, పశ్చిమడెల్టాకు 7200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

పింఛన్ సొమ్ము విడుదల

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.67.10 కోట్లు విడుదల చేసిందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వీణాదేవి తెలిపారు. 2,43,153మంది పింఛనుదారులకు ఈ సొమ్మును విడుదల చేశారన్నారు. నవంబరు ఒకటో తేదీ వేకువజాము నుంచే వలంటీర్లు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిక్కాల-2(చాగల్లు), వేమగిరి-1(కడియం), గోకవరం-4(గోకవరం), జగన్నాథపురం(గోపాలపురం),జంబూపట్నం(కోరుకొండ), సింగవరం(నిడదవోలు),హుకుంపేట-4(రాజమహేంద్రవరం రూరల్),రాధేయపాలెం (రాజానగరం),వేలివెన్ను-3(ఉండ్రాజవరం)లలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



సంఘ అధ్యక్షుడు వెంకటకృష్ణను అభినందిస్తున్న సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికైందని రాష్ట్ర కోఆర్డినేటర్ పీఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానికంగా రాష్ట్ర అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు, తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడిగా కోనేరు మురళీకృష్ణసాయి (రాజమహేంద్రవరం), అధ్యక్షుడిగా మేడా వెంకటకృష్ణ వరప్రసాద్ (చాగల్లు), కార్యదర్శిగా మద్దాల ధర్మాజీరావు (రాజమహేంద్రవరం) ఎన్నికయ్యారు. సలహాదారులుగా కొమ్మన వెంకటేశ్వరరావు (నిడదవోలు), ముత్యాల శ్రీనివాసరావు (కొవ్వూరు), ఉపాధ్యక్షులుగా గాజుల రంగారావు (నిడదవోలు), కరుటూరి వెంకటరామారావు (వెదుళ్లపల్లి) తదితరులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు వెంకటకృష్ణ మాట్లాడుతూ బిల్డింగ్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతా సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

ఉద్యాన సహాయకులకు పదోన్నతులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సచివాలయాల్లో గ్రామ ఉద్యాన సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మందికి ఉద్యాన విస్తరణ అధికారులుగా పదోన్నతులు లభించాయని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో తొమ్మిది మంది గ్రామ ఉద్యాన సహాయకులకు పదోన్నతి పత్రాలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదోన్నతులతో ఉద్యోగంలో మరింత బాధ్యత పెరుగుతుందని, దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. పదోన్నతులు పొందిన వారిలో పి.వెంకట సూర్యారావు, యు.సాయికుమార్, ఎం.శ్రేయామణి, ఆర్.అరవింద సాయి, కె.శివగణేష్, వి.కనక శిరీషా, పి.సూర్య పుష్ప, పి.వివేకానంద, సీహెచ్ సౌమిత్రి ఉన్నారు. జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాత కుమారి, కడియం ఉద్యాన అధికారులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఖరీఫ్ 2023-24 సీజన్‌లో 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 ఆదివారానికి 24 మంది రైతుల నుంచి 173.720 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లను జనరేట్ చేసి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ వరకూ ఆరబెట్టుకోవాలన్నారు. జిల్లాకు అవసరమయ్యే గోనె సంచులకుగాను ఇప్పటికే 50 శాతం సంచులను 231 రైతు భరోసా కేంద్రాలకు చేర్చామన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సందేహాలున్నా, ఫిర్యాదులకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఫోన్ నంబర్లు 83094 87151, 0883- 2940788కు చేయవచ్చన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

బియ్యం భోక్తలపై విజిలెన్స్

- దర్జాగా చౌక బియ్యం అక్రమ తరలింపు
- ఉమ్మడి 'తూర్పు'లో యథేచ్ఛగా దందా
- అక్రమార్కులపై అధికారుల ఉక్కుపాదం
- ఎప్పటికప్పుడు సరకు సీజ్.. కేసుల బనాయింపు
- 7నెలల్లో 2,005 క్వింటాళ్లు స్వాధీనం

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వివరాలు	
స్వాధీనం చేసుకున్న బియ్యం	2,005 క్వింటాళ్లు
బియ్యం విలువ	రూ. 47,97,560
స్వాధీనం చేసుకున్న వాహనాలు	34
వ్యక్తుల అరెస్టు	99 మంది

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు	
స్వాధీనం చేసుకున్న సరకు విలువ	రూ.10.41 కోట్లు
6ఏ-కేసుల నమోదు	35
క్రిమినల్ కేసులు	35
అక్రమ రవాణాలో పాల్గొన్నవారు	119

సాక్షి, రాజమహేంద్రవరం: బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. సరిహద్దు, సాధారణ ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేస్తోంది. అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్న సమాచారం అందుకుని దాడులు విస్తృతం చేస్తోంది. పట్టుబడిన లారీలు, బియ్యం బస్తాలను సీజ్ చేస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వారిపై క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తోంది.

ఉమ్మడి తూర్పులో ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి) జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు మాసాల వ్యవధిలో 2005 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. రూ.47,97,560 విలువైన సరకు సీజ్ చేశారంటే బియ్యం ఏస్థాయిలో పక్కదారి పడుతోందో అర్థం అవుతోంది. అక్రమ రవాణాకు వినియోగించిన 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 99 మందిని అరెస్టు చేసినట్లు విజిలెన్స్ అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నారు.

2022 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏకంగా రూ.10.41 కోట్ల విలువ చేసే సరకు సీజ్ చేశారు. ఇందులో పీడీఎస్ బియ్యం 7017.80 క్వింటాళ్లు, ధాన్యం . 16612.33 క్వింటాళ్లు, విరిగిన బియ్యం 274.5, రంగు మారిన బియ్యం 198.5, సాధారణ బియ్యం 8422.73 క్వింటాళ్లు ఉన్నాయి. అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసే ఫోర్టిఫైడ్ రైస్ 186 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఊక 51.75, సన్నబియ్యం 39 క్వింటాళ్లు పట్టుకున్నారు. బియ్యం రవాణాకు బిల్లులున్నా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా మరికొందరు తరలిస్తున్నట్లు తేలింది. వీటన్నింటిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ 1955 కింద 6-ఏ కేసులు 35 నమోదు చేశారు. మరో 35 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఇందులో 119 మంది పాల్గొన్నట్లు నిర్ధారించారు.

దాడులు చేస్తున్నా ఆగని దందా

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రూ.7 నుంచి రూ.10 చొప్పున మాఫియా సేకరిస్తోంది. వాటిని నూకలు, పిండిగా మార్చి పౌల్ట్రీ సంస్థలకు రూ.18 నుంచి రూ.25కు విక్రయిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు అధికంగా ఉండటంతో క్వింటాళ్ల కొద్దీ బియ్యం ఇక్కడకు దిగుమతి అవుతోంది. ఇళ్ల నుంచి బియ్యం కొనుగోలు చేసే చిరువ్యాపారులు, కొందరు డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు ఎగుమతి చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా నాలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటం, జల రవాణాకు అనుకూల వాతావరణం ఉండటంతో జిల్లా కేంద్రంగా దందా మూడు బస్తాలు.. ఆరు లారీల చందంగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు టన్నుల కొద్దీ బియ్యం రవాణా అవుతోంది. వివిధ మార్గాల ద్వారా సేకరించిన బియ్యాన్ని ముందుగా రహస్య స్థావరాల్లో ఉంచి అనంతరం అదను చూసి గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు సివిల్ సప్లయి, పోలీసులు, విజిలెన్స్ బృందాలు దాడులు చేస్తున్నా బెదిరేది లేదని రెచ్చిపోతున్నారు.





తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను వద్ద పట్టుబడిన బియ్యం లారీతో విజిలెన్స్ అధికారులు (అంతర చిత్రం) బియ్యం బస్తాలు

నూకలుగా మార్చి..!

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాలో మాఫియా కొత్త ఐడియాకు తెరతీసింది. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న బియ్యం తినేందుకు ఇష్టపడకపోవడం, మరి కొందరికి ఇంట్లో బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్న కారణాలతో చిరు వ్యాపారులు, రేషన్ డీలర్లకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే కార్డుదారుల నుంచి కిలోకు రూ.10 చొప్పున చెల్లించి ఈ పాస్ మెషీన్‌లో వేలిముద్ర వేయించుకుని పంపుతున్నారు. ఆ బియ్యం తమ దుకాణాల్లో నిల్వ ఉంచుతున్నారు. వాటిని వేరే సంచుల్లోకి మార్చి ఏమార్చుతున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లు, లారీల ద్వారా ఎవరికీ దొరకని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- గుంటూరు నుంచి కాకినాడ పోర్ట్‌కు 30 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేపడుతుండగా కొవ్వూరు చెక్‌పోస్ట్ వద్ద అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డాయి. ఈ ఘటనలో బియ్యం తరలిస్తున్న వ్యక్తులు, వాహనాన్ని సీజ్ చేశారు.
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్ద సాయంత్రం 4 గంటల సమయంలో 20 టన్నుల పీడీఎస్ బియ్యం, ఒక లారీని అధికారులు సీజ్ చేశారు.
- కోనసీమ జిల్లా ఆలమూరు-జొన్నాడ రోడ్డులోని ఎస్ మలుపు వద్ద లారీలో అక్రమంగా 566 బస్తాల్లో తరలిస్తున్న 27,000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.
- కాకినాడ జిల్లా గండేపల్లి వద్ద ఉన్న ఓ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందటంతో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో మిల్లులో నిల్వ ఉంచిన 111.565 మెట్రిక్ టన్నుల రూ.43,15,470 విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని, రెండు మినీ వ్యాన్లను అధికారులు సీజ్ చేశారు.

పటిష్ట నిఘా



బియ్యం అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేశాం. సమాచారం అందగానే బృందంతో రంగంలోకి దిగుతున్నాం. బియ్యం ఎక్కడెక్కడికి రవాణా చేస్తున్నారన్న విషయమై ఆరా తీస్తున్నాం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై దాడులు చేస్తున్నాం. పట్టుబడిన సరకును సీజ్ చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తున్నాం. ఉచిత బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు బనాయిస్తాం. -కరణం కుమార్, ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై పట్టుబడిన బియ్యం (ఫైల్)



కాకినాడ జిల్లా రౌతులపూడిలో స్వాధీనం చేసుకున్న బియ్యం (ఫైల్)

అర్జీ పెట్టుకున్న గంటలో ట్రై సైకిల్

- అందించిన కలెక్టర్ మాధవీలత
- వర్షితకు ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సకు సిఫార్సు



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గెడ్డం వర్షితకు స్పందనలో దరఖాస్తు చేసిన గంట వ్యవధిలోనే విభిన్న ప్రతిభావంతుల శాఖ నుంచి ట్రై సైకిల్ అందజేశామని కలెక్టర్ మాధవీలత అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌ను శెట్టిపేటకు చెందిన గెడ్డం శైలజ కలిసి తన కుమార్తె వర్షితకు చిన్నప్పటి నుంచి మాటలు రావని, నడవలేదని, రెండు పర్యాయాలు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స కూడా చేయించామని తెలిపారు. ఇటీవల తన భర్త కిడ్నీ సమస్యతో చనిపోవడంతో వేరే ఆధారం లేదని, తనకు వితంతు పింఛన్లు మంజూరు చేసి, ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే మాధవీలత స్పందించి వర్షితకు మరో పర్యాయం ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించాలని, తల్లి శైలజకు వితంతు పింఛను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డీఎల్‌డీఓ వీణాదేవికి సూచించారు. అదేవిధంగా ఉద్యోగానికి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్పందనలో కలెక్టర్‌తో పాటు జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. స్పందనకు 170 అర్జీలు వచ్చాయన్నారు. కాగా బాల్య వివాహాల నివారణలో భాగంగా సమాచార సేకరణ కోసం జిల్లాలో తొలిసారిగా టోల్ ఫ్రీ నంబరు 18004254156ను ప్రారంభించామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టరేట్ స్పందన హాలులో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ టోల్ ఫ్రీ నంబరును ఆవిష్కరించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరంరూరల్: ఐసీడీఎస్ పరిధిలో జిల్లా, బ్లాక్ స్థాయి అధికారులు, తదితర పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీడీఎస్ జిల్లా శిశు సంరక్షణ యూనిట్ పరిధిలో రాజమహేంద్రవరం కేంద్రంగా ఒక జిల్లా కో ఆర్డినేటర్ పోస్టు, ప్రొటెక్షన్ ఆఫీసర్ రెండు పోస్టులు (ఒకటి ఇనిస్టిట్యూషన్ కేర్), సోషల్ వర్కర్ పోస్టు, అకౌంటెంట్ పోస్టు, డేటా అనలిస్ట్, అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. అలాగే ఔట్రీచ్ వర్కర్ పోస్టులు రెండు, స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ కేటగిరీలో మేనేజర్ పోస్ట్, సోషల్ వర్కర్ పోస్టు, నర్సు (మహిళ) పోస్టు, డాక్టర్ (పార్ట్ టైం) ఒక్కొక్కటి, మహిళా ఆయాలు 5, చౌకిదార్ (పురుష/మహిళ) ఒక పోస్టు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. మంగళవారం నుంచి నవంబర్ 7వ తేదీ వరకూ దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు.వివరాలకు బొమ్మూరులోని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి, మహిళా ప్రాంగణంలోని కార్యా లయ పనివేళల్లో సంప్రదించాలన్నారు. వివరాలకు తూర్పుగోదావరి జిల్లా అధికారిక వెబ్‌సైట్ http://eastgodavari.ap.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన వాటిని సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను నవంబర్ 7వ తేదీలోగా పైఅడ్రస్‌లో అందజేయాలన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి



చాగల్లులో ఎన్నికల ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- ఎన్నికల ప్రచార రథానికి చాగల్లు శివాలయంలో పూజలు

చాగల్లు: రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రచారం కోసం ఆమె ఎన్నికల ప్రచార రథాన్ని సిద్ధం చేశారు. చాగల్లు శివాలయం వద్ద ఈ ప్రచార రథానికి సోమవారం పూజలు చేశారు. ఆనంతరం చాగల్లు 3వ వార్డులో మంత్రి వనిత ఆ ప్రచార రథంపై నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు, నాయకులు, వలంటీర్లు కలిసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్ర కుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండలశాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ముగిసిన
ఆరోగ్య సురక్ష శిబిరాలు



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీలకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారంతో ముగిశాయి. ఈ విషయాన్ని ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల ప్రత్యేక వైద్య బృందాలు ఖైదీలకు వైద్య సేవలు అందించాయి. ఈ శిబిరంలో తొలిరోజు 573 మంది, రెండో రోజు 1,025 మంది, మూడో రోజు 448 మంది కారాగార, శిక్షా, రిమాండ్ ఖైదీలు సేవలు పొందారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ బి.రత్నరాజు, జైలర్లు కేవీ రామారావు, సీహెచ్ రమేష్, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేష్, కె.సురేష్‌కుమార్, డిప్యూటీ జైలర్లు, కారాగార వైద్యాధికారులు పి.కోమల, హారిక, రవికుమార్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రైలు దుర్ఘటనతో ఆర్టీసీ అదనపు బస్సులు

ఎమర్జెన్సీ హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు	
రాజమహేంద్రవరం	0883-2420 251
తుని	08864-252172
సామర్లకోట	0884-2327010

రాజమహేంద్రవరం సిటీ: విజయనగరం జిల్లా సమీపంలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రమాద ఘటనతో రైల్వే శాఖ సోమవారం రాజమహేంద్రవరం మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసింది. రైళ్ల రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రత్నాచల్ (12717/18), సింహాద్రి(17239),రాజమహేంద్రవరం-విశాఖపట్నం- రాజమహేంద్రవరం (07466/67),నాందేడ్(20809). ఫలక్‌నామా (12703), కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రైళ్లను రద్దు చేసింది. రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సి వచ్చింది.

విజయవాడ డివిజనల్ రైల్వే అధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు రెండో రోజు కూడా హెల్ప్ డెస్క్ కొనసాగించారు. హెల్ప్ డెస్క్ మంగళవారం వరకూ కొనసాగుతుందని స్టేషన్ ఛీప్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి తెలిపారు. డెస్క్ 24 గంటలు పని చేస్తుందన్నారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం

30 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రైలు ప్రమాద ఘటనతో రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడింది. ప్రయాణీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. విశాఖపట్నం వైపు వెళ్లడానికి సోమవారం 30 ప్రత్యేక బస్సులు నడిపింది. రోజూ విశాఖపట్నానికి రెగ్యులర్‌గా 8 బస్సులు నడుపుతుండగా వీటి సంఖ్యను పెంచింది. డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న హెల్ప్ డెస్క్

క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కి 'నన్నయ' విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కి వర్సిటీ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. వీరిలో డి.ప్రియాంక (ఆదిత్య డిగ్రీ కాలేజీ, కాకినాడ), టి.అపరంజిత (ఐడీఎల్ కాలేజీ, కాకినాడ), కె.తరుణి (ఆదిత్య డిగ్రీ కాలేజీ, తుని), ఈ.గీతాదేవి (ఎస్‌కేవీఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు), ఆర్.నాగేశ్వరి (ఆదిత్య డిగ్రీ కాలేజీ, రాజమహేంద్రవరం) ఉన్నారు. వీరిని విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగే వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కి పంపిస్తున్నామన్నారు. 10 రోజులపాటు జరిగే ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చినవారు జనవరి 1 నుంచి 31 వరకు ఢిల్లీలో జరిగే పరేడ్‌లో పాల్గొంటారన్నారు. ఈ పరేడ్‌లో చక్కటి ప్రతిభను కనబరిచి, యూనివర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరుతూ వీసీ వారిని అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆయా కళాశాలల ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని గుర్కా మృతి


మృతుడు గిరిరామ్

గోపాలపురం: స్థానికంగా గుర్కాగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన గిరిరామ్(40) సోమవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. పెద్దగూడెం ఎంపీపీ పాఠశాల పక్కన ఉన్న కమ్యూనిటీ హాలులో అతను నివాసం ఉంటున్నాడు. గిరిరామ్‌కు బంధువులు ఎవరూ లేకపోవడంతో అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భక్తుల వసతికి శివసదన్ సిద్ధం

- నేటి నుంచి అద్దెకు అందుబాటులో మొత్తం 137 గదులు
- 116 సింగిల్, 20 సూట్ రూమ్స్, ఒక డబుల్ రూమ్
- సత్రం గదుల ద్వారా రోజుకు ఆదాయం రూ.2,56,060

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్యగిరిపై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఐదంతస్తుల 'శివసదన్' సత్రంలో 137 గదులను మంగళవారం నుంచి భక్తులకు అద్దె కివ్వనున్నట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సత్రాన్ని ఇంకా అధికారికంగా ప్రారంభించనప్పటికీ వివాహ ముహూర్తాల వలన భక్తుల వసతి గదుల కోసం దేవస్థానంపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకురాగా భక్తులను ఇబ్బంది పెట్టవద్దని, సత్రం ప్రారంభం కాలేదని దేవస్థానానికి వచ్చే ఆదాయాన్ని కూడా ఆపవద్దని తెలిపారని వివరించారు. అందుకే ఈ సత్రం గదులను మంగళవారం నుంచి అద్దెకిస్తున్నట్టు తెలిపారు.



శివసదన్ సత్రంలో గదుల అద్దె వివరాలు

- సింగిల్ రూమ్స్ 116 రూ.1,770 (18 శాతం జీఎస్‌టీతో కలిపి)
- సూట్ రూమ్స్ 20 రూ.2,360 (18 శాతం జీఎస్‌టీతో కలిపి)
- డబుల్ రూమ్స్ 1 రూ.3,540 (18 శాతం జీఎస్‌టీతో కలిపి)
- గదులన్నీ అద్దెకిస్తే దేవస్థానానికి ఈ సత్రం ద్వారా రోజుకు రూ.2,56,060 ఆదాయం వస్తుంది. నెలకు సుమారు రూ.77 లక్షల ఆదాయం వచ్చే వీలుంది.
- అన్ని గదులూ ఏసీ, ప్యానల్ బోర్డుతో అనుసంధానం


సత్రం గదులను అనుసంధానం చేసే ప్యానల్ బోర్డు

- శివసదన్ సత్రంలో గదులన్నీ ఏసీ. దాంతోబాటు ఎలక్ట్రానిక్ ప్యానల్ బోర్డుతో అనుసంధానం చేసి ఉంటాయి. ప్యానల్ బోర్డులో ప్రతి గదికి రెండు లైట్లు ఉంటాయి. రూమ్ ఖాళీగా ఉంటే గ్రీన్ లైటు, అద్దెకి ఇస్తే ఎరుపు లైటు వెలుగుతుంది. రూమ్ తాళానికి కలిపి ఉండే ప్లాస్టిక్ కార్డును రూమ్ లోపల ప్లగ్‌లో పెడితేనే గదిలో విద్యుత్ సరఫరా అవుతుంది. ఆ కార్డు బయటకు తీస్తే సరఫరా నిలిచిపోతుంది. ఈ సత్రానికి నాలుగు చోట్ల మెట్లు, రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారు.
- సత్రంలో సుమారు 50 గదులలో మంచం, సోఫా, కుర్చీలు, తదితర ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. మిగిలిన గదులలో ఫర్నిచర్ ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. సత్రం గదులను భక్తులకు మంగళవారం నుంచి అద్దెకు ఇస్తుండడంతో సత్రం అంతా కడిగి సిద్ధం చేస్తున్నారు.


శివసదన్ సత్రం లోపల శుభ్రం చేస్తున్న సిబ్బంది

అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధార్ గోప్యత

డాక్యుమెంట్‌లో ఆధార్ చివరి నాలుగు అంకెలే వేయాలంటూ ఆదేశాలు


డీఐజీ నాగలక్ష్మి

కాకినాడ లీగల్: రిజిస్ట్రేషన్ల సమయంలో డాక్యుమెంట్లలో అక్రమాలకు, ట్యాంపరింగ్‌లకు ఆస్కారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగం రిజిస్ట్రేషన్ చేసే సమయంలో డాక్యుమెంట్‌పై పూర్తిగా 12 అంకెలతో కూడిన ఆధార్ నంబర్ వేయకుండా చివరి నాలుగు అంకెలు మాత్రమే డాక్యుమెంట్‌పై వచ్చే విధంగా రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ వి.రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్యుమెంట్‌పై పూర్తిగా 12 అంకెలతో కూడిన ఆధార్ వేయడం వల్ల, డాక్యుమెంట్ వెనుక వేలిముద్రలు వేయడం వల్ల ఆ వ్యక్తి వేలిముద్రలను ఇటీవల కొంతమంది సేకరించి ఆధార్ నంబర్లతో వివిధ రకాలుగా అక్రమాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీటిని అరికట్టేందుకు ఈ విధమైన ఏర్పాట్లను చేశారు. ప్రజలు, న్యాయవాదులు, లేఖర్లు డాక్యుమెంట్ తయారు చేసే సమయంలో చివరి నాలుగు నంబర్లు మాత్రమే నమోదు అయ్యే విధంగా చూసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ విధానం సోమవారం నుంచే అమలులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.

బాలికపై అత్యాచార యత్నం

ముమ్మిడివరం: 13 ఏళ్ల బాలికపై ఆమె మేనమామ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడన్న కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ వంగలపూడి వారిపేటకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను ఆమె మేనమామ వంగలపూడి శ్రీనివాసరావు కొంతకాలంగా ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని వెంట పడి వేధిస్తున్నాడు. ఈ నెల 17న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరావు అత్యాచారానికి ప్రయత్నించడంతో అతనిని నుంచి తప్పించుకుని బంధువుల ఇంటికి వెళ్లింది. బాలిక తల్లితండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. బంధువుల సహకారంతో బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని సోమవారం అరెస్టు కోర్టులో హజరు పర్చినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

ఇద్దరి దొంగల అరెస్ట్

31 గ్రాముల బంగారం, రూ.84 వేల నగదు, బైక్ స్వాధీనం

అమలాపురం టౌన్: మోటారు సైకిల్‌పై వెళుతున్న అన్నాచెల్లెళ్లను వెంబడించి వారి వద్ద బంగారం, నగదుతో ఉన్న బ్యాగ్‌ను దోచుకున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. అమలాపురం ఎర్ర వంతెన సమీపంలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం అన్నా చెల్లెళ్ల నుంచి బ్యాగ్‌ను లాక్కుని ఆ ఇద్దరూ పరారైనట్లు చెప్పారు. అదే రోజు ఈ దోపిడీకి ముందు వారు ఐ.పోలవరం మండలం మురమళ్ల సమీపంలో ఓ మోటారు సైకిల్ దొంగిలించారు. అదే మోటారు సైకిల్‌పై వచ్చి ఈ దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. ఐ.పోలవరం మండలం బాణాపురానికి చెందిన అన్నా చెల్లెళ్లు మోటారు సైకిల్‌పై బంగారు నగలు కొనుగోలుకు అమలాపురం వచ్చారు. ఓ దుకాణంలో బంగారు గొలుసు కొనుగోలు చేసి వారి వద్ద ఉన్న పాత బంగారు గొలుసు మరమ్మతు చేయించుకున్నారు. బంగారు నగలతోపాటు రూ.1.50 లక్షలతో ఉన్న బ్యాగ్‌తో వారు మోటారు సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. వారిని అప్పటికే దొంగిలించిన మోటారు సైకిల్‌పై ఆ ఇద్దరి యువకులు వెంబడించారు. అమలాపురం ఎర్రవంతెన సమీపానికి వెళ్లేసరికి ఆ బ్యాగ్‌ను లాక్కుని పరారయ్యారు. అమలాపురం తాలూకా పోలీసులు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలించారు.

ఆ ఇద్దరి యువకులను గుర్తించి అరెస్ట్ చేశారు. కాకినాడ డెయిరీ ఫారం సెంటర్‌కు చెందిన పాలూరి రాజేష్ (19), కరప మండలం నడకుదురుకు చెందిన కల్యాణపు ఫణీంద్రసాయి (21)ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 31 గ్రాముల రెండు బంగారు గొలుసులు, కాజేసిన రూ.1.50 లక్షల నగదులో రూ.84 వేలు, దొంగిలించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం తాలూకా, ఐ.పోలవరం పోలీసు స్టేషన్లలో వారిపై కేసులు నమోదు అయ్యాయి. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎ.పరదేశి ఈ కేసును లోతుగా దర్యాప్తు చేశారు. వీరితోపాటు క్రైమ్ సీఐ బి.తిరుపతిరావు, కాకినాడ సీసీఎస్ బృందం సమష్టి దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. వీరిని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అభినందించారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

మృతురాలు ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో టీచర్


నాగవెంకటలక్ష్మి మృతదేహం

ఆత్రేయపురం: మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన సుంకర నాగ వెంకటలక్ష్మి (36) ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు ఆమె సోదరుడు సుంకర కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అక్క ఆలమూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోందని, భర్త రమేష్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి భర్త ఫార్మా కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై బీవై కిరణ్‌కుమార్ పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సిబ్బంది రక్షణకు ఆర్టీసీ కట్టుబడి ఉంది

ఎండీ ద్వారకా తిరుమలరావు


రామచంద్రపురం డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

రామచంద్రపురం రూరల్: డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులను ఖండిస్తున్నామని, వారి రక్షణకు సంస్థ కట్టుబడి ఉందని ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంస్థ పనిచేస్తుందన్నారు. సంస్థకు ఆదాయం పెరిగేలా అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. బకాయిలను సంస్థ చెల్లిస్తుందన్నారు. కార్గో, పార్శిల్ ఆదాయం పెరిగేలా కృషి చేయాలన్నారు. డోర్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సంస్థ కార్మికులు, ఉద్యోగులు ఎస్‌బీఐ బ్యాంకు రూపే కార్డు ద్వారా అధిక ఇన్సూరెన్స్ పొందేలా ఎస్‌బీఐతో ఒప్పందం జరిగిందన్నారు. అనంతరం డిపోను పరిశీలించి సిబ్బందితోను, ప్రయాణికులతోను మాట్లాడారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి, డీపీటీఓ ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు, ఎస్సై సురేష్‌బాబు, ఆర్టీసీ అధికారులు, సెక్యూరిటీ, గ్యారేజీ, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది, యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కారు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టి పరారు

అమలాపురం టౌన్: ఓ కారును అద్దెకు తీసుకుని ఆపై దానిని తాకట్టు పెట్టి, కారు యాజమానికి సమాధానం చెప్పకుండా పరారీలో ఉన్న సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన బీర కృష్ణమూర్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మహ్మద్ అబ్బాస్ హైదర్ ఓ ఫొటో స్టూడియో నిర్వహిస్తూనే తన వద్ద ఉన్న సుజుకీ బెలేనో కారును అద్దెకు తిప్పుకుంటున్నారు.

ఈ కారు నంబరు, వివరాలను ఓఎల్ఎక్స్‌లో పెట్టి అద్దెకు తిప్పుతున్నట్లు ప్రకటించుకున్నారు. ఆరు నెలల కిందట బీర కృష్ణమూర్తి అబ్బాస్ హైదర్‌ను పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పాడు. ఆ మాటలను నమ్మి కృష్ణమూర్తికి కారును అద్దెకు ఇచ్చారు. తర్వాత అతడు ఆ కారును వేరే చోట తాకట్టు పెట్టి సొమ్ము చేసుకున్నాడని సీఐ తెలిపారు. కృష్ణమూర్తి ఎంతకీ సమాధానం చెప్పకపోవడంతో కారు యాజమాని అబ్బాస్ హైదర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ క్రాంతికుమార్ చెప్పారు. నిందితుడు బీర కృష్ణమూర్తి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. కృష్ణమూర్తి ద్వారా ఈ తరహాలో ఎవరైనా నష్టపోయి ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సీఐ తెలిపారు.

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి స్థలం విరాళం


కపిలేశ్వరపురంలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో పార్కింగ్ ప్రదేశాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన మేకా బుల్లిఅబ్బు, సూరమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యచంద్ర పట్టాభిరామారావు, రాజ్యలక్ష్మి దంపతులు స్థానిక ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి రూ.20 లక్షల విలువ చేసే ఐదు సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలాన్ని ఆసుపత్రి సందర్శకుల వాహన పార్కింగ్‌గా మెరుగుపర్చారు. పార్కింగ్ ప్రదేశాన్ని సోమవారం దాత కుటుంబీకులు మేకా సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎంఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. వారిని గ్రామ సర్పంచ్ శాకా శ్రీనివాస్, ఆసుపత్రి నిర్వాహకులు అభినందించారు.

తాతబాబు కుటుంబానికి రూ.లక్ష సాయం


తాతబాబు కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రౌతులపూడి గ్రామానికి చెందిన గంపా తాతబాబు భార్య గంప సత్యవతి పిడుగుపాటుకు గురై మృతి చెందింది. అద్దె ఇల్లు, ముగ్గురు చిన్న పిల్లలతో జీవనం కష్టంగా ఉందని ఆర్థిక సాయం కోరుతూ ఈ నెల 12న పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాతబాబు విన్నవించారు. అర్హతలు పరిశీలించి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను ఆదేశించారు. దీంతో సోమవారం కాకినాడలో జరిగిన స్పందన కార్యక్రమంలో తాతబాబుకి రూ.లక్ష చెక్కును కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో కలిసి అందజేశారు.

బియ్యం వ్యాపారి హత్య కేసులో ముద్దాయి అరెస్టు

సామర్లకోట: మండల పరిధిలోని చంద్రపాలెం గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి జల్లిగంపల తాతబ్బాయి హత్య కేసులో ముద్దాయిని సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం తాతబ్బాయి బియ్యం అమ్మకానికి సంబంధించిన బకాయిలను వసూలు చేసుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో చంద్రపాలెం గ్రామానికి చెందిన తలాటం రాంబాబు ఇంటికి వెళ్లాడు. రాంబాబు బియ్యం వ్యాపారిని ఇంటి లోనికి తీసుకొని వెళ్లి రుమాలుతో గొంతు నలిమి చంపి వేసి, అతని వద్ద ఉన్న నాలుగు బంగారు ఉంగరాలను తీసుకొన్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత తాతబ్బాయి శవాన్ని గ్రామంలోని బెజవాడ సత్యనారాయణకు చెందిన వరి పొలంలో మట్టితో కప్పి వేశాడు. ముద్దాయి చెడు వ్యసనాలకు డబ్బు అవసరమై తాతబ్బాయిని హత్య చేసినట్టు గుర్తించామని సీఐ చెప్పారు. మంగళవారం ముద్దాయిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

ఊరు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

13 కాసుల బంగారం, పావు కేజీ వెండి, 33 వేల నగదు చోరీ

రాజోలు: ఊరు వెళ్లి వచ్చే సరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. కూనవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు 13 కాసుల బంగారం, పావు కేజీ వెండి, 33 వేల నగదు చోరీ చేశారు. రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనవరం గ్రామానికి చెందిన ఉల్లూరి బాలకృష్ణ తన కుటుంబంతో కలసి అత్తవారి ఇంటికి తాటిపాక ఈ నెల 27వ తేదీన వెళ్లారు. తిరిగి మళ్లీ ఈ నెల 29న తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులకొట్టి గదిలో ఉన్న బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు.


చోరులు ధ్వంసం చేసిన బీరువా తలుపులు

బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒక్కరోజులో రూ.11 కోట్ల డిపాజిట్ల సేకరణ రికార్డు

భీమవరం పోస్టల్ సూపరింటెండెంట్ బాల సుబ్రహ్మణ్యం


పిట్టల వేమవరంలో బ్రాంచ్ పోస్టాఫీస్ ప్రారంభించిన బాలసుబ్రహ్మణ్యం

పెరవలి: దేశంలో పోస్టల్ చరిత్రలో ఒక్కరోజులో రూ.11 కోట్ల డిపాజిట్లు సేకరించి భీమవరం డివిజన్ రికార్డు సాధించిందని ఆ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పెరవలి మండలం పిట్టల వేమవరంలో సోమవారం బ్రాంచ్ పోస్టాఫీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం నూతనంగా ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం కింద ఒక్కరోజులో 12,400 అకౌంట్లు ఓపెన్ చేసి రూ.11 కోట్లు డిపాజిట్లుగా సేకరించామని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో కానీ, ప్రయివేట్ రంగంలో కానీ ఇవ్వనంత వడ్డీని పోస్టల్ డిపాజిట్లకు 8.3 శాతం ఇస్తున్నామని అన్నారు. పోస్టాఫీసులు గతంలో ఉత్తరాలు పంపిణీ చేసే కేంద్రాలుగా ఉండేవని, నేడు అన్ని రంగాల్లో అడుగు పెట్టి ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్నాయన్నారు. ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా వేల మందికి సేవలు అందిస్తున్నామని వివరించారు. భీమవరం డివిజన్ పరిధిలో 219 బ్రాంచ్ పోస్టాఫీస్‌లు, 63 సబ్ పోస్టాఫీస్‌లు, 3 హెడ్ పోస్టాఫీస్‌లు ఉన్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భీమవరం డివిజన్ పరిధిలో సొంత భవనాలు ఉన్నాయన్నారు. తణుకు పోస్టాఫీస్ సూపరింటెండెంట్ ఎం.సూర్యప్రకాశ్, గ్రామ సర్పంచ్ మండ హైమావతి, సొసైటీ అధ్యక్షుడు మండ తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రరాజు పావని, మండ సత్యనారాయణ (చిన్న), గోపి ఖండవల్లి, వడలి పోస్టుమాస్టర్లు ప్రశాంత్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

కరప: తల్లిదండ్రులు మందలించారని తాగుడుకు బానిసైన ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరప శివారు పేపకాయలపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు... పేపకాయలపాలెం గ్రామానికి చెందిన నిమ్మన దుర్గారావు, ఆదిలక్ష్మిల కుమారుడు మణికంఠస్వామి(25) తాపీపని చేస్తుంటాడు. అవివాహితుడైన మణికంఠస్వామి తల్లిదండ్రులు మాటలు లెక్క చేయక తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 29వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తండ్రి దుర్గారావు మందలించడంతో మణికంఠస్వామి కోపంతో బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో పేపకాయలపాలెం పరిసర గ్రామాల్లో గాలించారు. రైల్వే ట్రాక్ వద్ద పడి ఉండటంతో వెంటనే చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. సోమవారం మృతుని తల్లి ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కందుకూరి ఆశయాన్ని విస్మరించామనడం అవాస్తవం

– హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి


సమావేశంలో మాట్లాడుతున్న హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం సిటీ) : కందుకూరి వీరేశలింగం స్థాపించిన హితకారిణి సమాజం, విద్యాసంస్థల పట్ల పాలకమండలి నిర్లక్ష్యం వహిస్తోందంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తమని చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి అన్నారు. సోమవారం ఎస్‌కేఆర్ మహిళా కళాశాల ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీ అభ్యుదయానికి బాటలు వేసిన కందుకూరి వీరేశలింగం ఆశయాలను పరిరక్షించాలనే ఆశయంతో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కొత్త కోర్సులు తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు చేశామని అన్నారు. సాంకేతిక సమస్యలు, ఈఓ కె.విజయలక్ష్మి సహకారం లభించకపోవడం వల్లే నూతన కోర్సులను ప్రారంభించడానికి వీలుపడలేదన్నారు. కందుకూరి వీరేశలింగం సతీమణి రాజ్యలక్ష్మి చల్లని నీడలో అనేక మంది విద్యాబుద్ధులతో పాటు ఉపాధి పొందుతున్నారన్నారు. పాలకమండలి చైర్మన్, డైరెక్టర్లకు గౌరవం లభించడం లేదనే ఆవేదనతోనే సమావేశాలకు దూరంగా ఉన్నారు తప్ప, తమ మధ్య విభేదాలు లేవన్నారు. ప్రస్తుత ఈఓ బదిలీపై వెళ్తున్నందున మరొకరు బాధ్యతలు తీసుకోగానే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రతిపాదనలను అమలు చేస్తామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
మంగళవారం ॥ 31-10-2023



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.



పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషా పరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంబై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్

తేజో చంద్రిక



బిజినెస్ లీడర్‌గా...

ఆరోజు...

'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.

'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.

'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.

'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు



5 రోజుల వయసులో పిల్ల పురుగులు



గ్రాములో 3 వేల పిల్ల పురుగులు



కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం



ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం



15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్



బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కైటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.